క్లుప్తంగా

పీఎం వికాస్ పథకానికి కేవైసీ తప్పనిసరి

ఎచ్చెర్ల క్యాంపస్: పీఎం వికాస్ పథకం వర్తింపునకు రైతులు కేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలని ఎచ్చెర్ల వ్యవసాయ అధికారి వై.సురేష్ చెప్పారు. ఎచ్చెర్ల రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీలోగా రైతులు కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. సమీపంలోని సీఎస్‌సీ సెంటర్‌కు వెళ్లి బయోమెట్రిక్, ఆధార్ ఓటీపీ ద్వారా కేవైసీ పూర్తిచేసుకోవాలని సూచించారు. సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యాన సహాయకుల వద్ద సైతం కేవైసీ సేవలు పొందవచ్చునన్నారు.

పింఛన్ల పంపిణీ


పింఛన్ అందజేస్తున్న నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు సర్పంచ్ నేతింటి యమున, మాజీ సర్పంచ్ నీలం పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని పెంచుకుంటూపోతున్నారన్నారు.

ఆనందపురంలో వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

జి.సిగడాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఇంటి వద్దకే వైద్య సిబ్బంది వచ్చి అందించే సేవలను ప్రజలు వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి యశ్వంత్ కోరారు. ఆనందపురం గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. మంచాలకు పరిమితమైన రోగులకు ఇంటి వద్దకు వచ్చి వైద్యసేవలు అందించి మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిత్తిరి మంజు, హెల్త్ అసిస్టెంట్ పేడాడ సత్తెరాజు, ఏఎన్ఎం వై.నాగమణి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

పేదలకు వస్త్రదానం


వస్త్రాదానం చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలో సర్పంచ్ బుడారి లక్ష్మణరావు సమక్షంలో జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు బుధవారం వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గ్రామాభివృద్ధి కోసం యువతీ, యువకులు ముందడుగు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తుల సన్యాసిరావు, చందనాల రంగారావు, పంచాయతీ కార్యదర్శి హిమబిందు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి క్షీరాభిషేకం


స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామికి క్షీరాభిషేకాలు జరిగాయని అర్చకుడు దేవరకొండ శంకరనారాయణ శర్మ తెలిపారు. స్వామికి పంచామృతాభిషేకాల సేవలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు, ఎస్.శ్రీనివాసరావు ఏర్పాట్లు చేశారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి


సిబ్బందితో సమీక్షిస్తున్న పీడీ చిట్టిరాజు

లావేరు: అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులు చేపట్టాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. లోపెంట గ్రామంలో జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా టీఏలు, ఎఫ్ఏలతో పనుల ప్రగతిపై సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నిర్దేశించిన కొలతల ప్రకారం రోజూ ఆరు గంటలు పనిచేస్తేనే రూ. 257 వేతనం గిట్టుబాటు అవుతోందన్నారు. ఏపీవో సత్యవతి, జేఈ లెనిన్‌బాబు, టీఏలు రమణ, గౌరునాయుడు, ఎఫ్ఏలు శ్రీరామరెడ్డి, రామిరెడ్డి ఉన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సందడి


ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినుల సందడి


జి.సిగడాం: సంప్రదాయ దుస్తుల్లో అద్వానంపేట పాఠశాల విద్యార్థినులు


ఎచ్చెర్ల: ధర్మవరం గ్రంథాలయంలో రంగవల్లులు వేస్తున్న విద్యార్థినులు


రణస్థలం ఎంపీయూపీ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు


రణస్థలం: ఆదర్శపాఠశాలలో సంప్రదాయ దుస్తుల్లో ఉపాధ్యాయులు


శ్రీకాకుళం రూరల్: సింగుపురంలోని క్రాంతి విద్యానికేతన్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


శ్రీకాకుళం న్యూకాలనీ: శర్వాణి విద్యాలయంలో భోగిమంట వెలిగిస్తున్న అందవరపు సూరిబాబు


శ్రీకాకుళం న్యూకాలనీ: సంక్రాంతి వేడుకల్లో నవయుగ పాఠశాల విద్యార్థులు, సిబ్బంది


గార: తూలుగు ప్రాథమికోన్నత పాఠశాలలో భోగి వేడుక


జి.సిగడాం: చంద్రయ్యపేట యూపీ పాఠశాలలో..


శ్రీకాకుళం న్యూకాలనీ: కాకినాడ ఆదిత్య మహిళా కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న సిబ్బంది


చిలకపాలెం శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి ఉట్టిపడేలా గ్రామీణ సెట్


లావేరు: అప్పాపురం పాఠశాలలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం


లావేరు: అప్పాపురం పాఠశాలలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు


లావేరు: మురపాక పాఠశాలలో భోగి మంటలు

విద్యార్థులకు సంక్రాంతి సందడి ముందే వచ్చింది. పాఠశాలలకు గురువారం నుంచి పండుగ సెలవులు కావడంతో బుధవారం పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గ్రంథాలయాల్లో సంక్రాంతి సంబరాలను అంబరాన్ని అంటేస్థాయిలో నిర్వహించారు. భోగి మంటలు, గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసులు, జంగమయ్యల కీర్తనలు, ముగ్గుల పోటీలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి వాతావరణం నెలకొంది. భోగి, సంక్రాంతి, కనుమ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

జాతీయ పెన్‌కాక్‌సిలాట్ పోటీలకు నలుగురు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ:

జాతీయస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల పెన్‌కాక్‌సిలాట్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఉన్న గురుగోవింద్‌సింగ్ జీ ఇండోర్ స్టేడియం వేదికగా పోటీలు జరగనున్నాయి. ఎంపికైన వారిలో అండర్–17 కేటగిరీ 50 కేజీల విభాగంలో గిడుతూరి దుర్గాదాస్, 75 కేజీల విభాగంలో మామిడి పవన్‌సాయి, అండర్–14 కేటగిరీ 35 కేజీల విభాగంలో వి.రోహిత్‌చౌదరి, 40 కేజీల విభాగంలో లితిన్‌చైతన్య ఉన్నారు. వీరంతా బుధవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. అత్యుత్తమ ఆటతీరుతో రాణించి పతకాలతో తిరిగిరావాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.సుందరరావు మాస్టారు, మార్షల్ ఆర్ట్స్ కోచ్ రేగిడి దయామయ, పెన్‌కాక్‌సిలాట్ ప్రధాన శిక్షకుడు, జిల్లా సంఘ కార్యదర్శి నక్క లక్ష్మణ్‌నాయుడు ఆకాంక్షించారు.


క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

ఆలిండియా శిష్టకరణ సంఘం కార్యదర్శిగా శ్రీనివాస్ పట్నాయక్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

ఆలిండియా శిష్టకరణ సంఘం కార్యదర్శిగా సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బగ్గాం శ్రీనివాస్ పట్నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ అధ్యక్షుడు డబ్బీరు వెంకటకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పట్నాయక్ మాట్లాడుతూ.. తమ సామాజికవర్గ సంక్షేమానికి, ఓబీసీ సాధనకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావుకి కృతజ్ఞతలు తెలియజేశారు.


నియామక పత్రంతో శ్రీనివాస్ పట్నాయక్

19 నుంచి ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, టూవీలర్ మెకానిజంలో ఉచిత శిక్షణను నెల రోజులు అందిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచితంగా వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. అభ్యర్థులు పాత శ్రీకాకుళం జిల్లా వాసులై ఉండాలని, పదో తరగతి వరకూ చదవాలని, బీపీఎల్ రేషన్‌కార్డు, 19 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 79933 40407, 95534 10809 నంబర్లను సంప్రదించాలన్నారు.

రాగులు సాగుపై ఆసక్తి చూపాలి

రణస్థలం:

రాగులు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపాలని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ అన్నారు. వెల్బురాయి గ్రామంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. చిరుధాన్యాలతో చేకూరే ఉపయోగాలు, అవశ్యకతను వివరించాలన్నారు. సహజ సిద్ధ వనరులతో పంటలను సాగు చేయడం, భూసార పరీక్షలను బట్టి ఎరువులు వాడటం, వానపాములు, సేంద్రియ ఎరువుల వాడకంతో చేకూరే లాభాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రణస్థలం ఏడీఏ వి.శ్రీనివాసరావు, ఎఫ్‌టీసీ ఏడీఏ సీహెచ్ వెంకటరావు, ఏవో విజయ భాస్కరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీధర్

ద్విచక్ర వాహనాలకే అనుమతి

శ్రీకాకుళం క్రైమ్: సంక్రాంతి నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా పట్టణంలో రెండుచోట్ల ట్రాఫిక్ పోలీసులు ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. దీనికి సంబంధించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు ట్రాఫిక్ నియంత్రకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా సూర్యమహల్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ట్రాఫిక్ నియంత్రణ చేపడుతున్నట్లు ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌వీవీ ప్రసాదరావు చెప్పారు. ఆటోలు, కార్లు, ఇతర పెద్ద వాహనాలేవీ ఈ మార్గంలోకి రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు.


సూర్యమహాల్ పెట్రోల్ బంక్ దరిలో హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన దృశ్యం

కె.మత్స్యలేశంలో 14, 15 తేదీల్లో సంక్రాంతి సంబరాలు

గార: కె.మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం)లో ఈ నెల 14, 15 తేదీల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహిస్తామని సర్పంచ్ బి.లలిత, నాయకుడు ఎర్రన్న బుధవారం తెలిపారు. భోగి రోజున మగవారిచే ఉట్టుకొట్టు–గిప్పు పట్టు, మహిళలు, చిన్నారులచే కోలాటం, రంగోలీ పోటీలు ఉంటాయన్నారు. సాయంత్రం మ్యూజికల్ ఛైర్, హౌసీ, ప్రముఖ టీవీ కళాకారులచే కామెడీ కార్యక్రమం ఉంటుందన్నారు. సంక్రాంతి రోజున ముగ్గుల పోటీలు, సంప్రదాయ దుస్తుల ఫ్యాషన్ షో, కిడ్స్ కాంపిటేషన్ ఉంటుందన్నారు. సాయంత్రం గాలిపటాల పండుగ, లక్కీ డ్రా ఉంటుందన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందేవారికి నూతనంగా నిర్మాణం జరుగుతున్న జగనన్న కాలనీలో బహుమతులను ప్రదానం చేస్తామన్నారు.

'యువతకు అండగా ఉంటాం'

లావేరు: యువతకు అండగా ఉంటామని జనసేన పార్టీ నాయకుడు కె.నాగబాబు అన్నారు. తాళ్లవలస గ్రామానికి గురువారం విచ్చేసిన ఆయన గురువారం జరగనున్న యువశక్తి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఆనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. యువత ఆలోచనలను బయటకు తేవాలన్న ఉద్దేశంతోనే పవన్‌కల్యాణ్ యువశక్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమం కోసం ఎవరికి ఎటువంటి ఇబ్బందుల లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. కాగా యువశక్తి ఏర్పాట్లను జిల్లా ఎస్పీ జి.ఆర్. రాధిక బుధవారం పరిశీలించారు.

కాశీలో 'యామిని' కూచిపూడి ప్రదర్శన



శ్రీకాకుళం కల్చరల్: ప్రఖ్యాత కాశీ(వారణాశి)లో శ్రీకాకుళంకు చెందిన సాంప్రదాయం గురుకులం ఫ్యాకల్టీ యామినీ కాశిరెడ్డి సోమవారం కూచిపూడి ప్రదర్శన నిర్వహించారు. కాశీ గంగా ఘాట్ వద్ద, కాశీ ఆలయంలో, మార్వాడీ సదన్‌లో తన కూచిపూడి ప్రదర్శన ఇవ్వగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నీలకంఠ తివారి ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ తన గురువు స్వాతీ సోమనాథ్ నూతనంగా ప్రవేశపెట్టిన 'నడివీధిలో కూచిపూడి'లో భాగంగా ఈ ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. గతంలో లడఖ్ వెళ్లి పది రోజుల ప్రదర్శన ఇచ్చానన్నారు. కాశీలోనూ ఏడు రోజులు ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు.

ఘనంగా కూడార్రై ఉత్సవం

శ్రీకాకుళం కల్చరల్: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో కూడార్రై ఉత్సవం వైభవంగా బుధవారం జరిగింది. కూడార్రై వెల్లం పాశురం చదువుతూ 108 వెండి గిన్నెల్లో స్వామికి చక్రపొంగలి ప్రసాదం నివేదన చేసి వేడుకలు జరిపారు. గుజరాతిపేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామిని పూలతో అలంకరించి అర్చన చేశారు. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు కూడార్రై పాశురం చదివి గోదాదేవి రంగనాథుని వేడుకున్న విధానాన్ని భక్తులకు వివరించారు. వెండి గిన్నెల్లో స్వామికి ఆరగింపు నివేదన చేసిన అనంతరం భక్తులకు పంచారు. స్వామికి నక్షత్ర హారతిని సమర్పించారు. చిన్నబజారులోని దూడివారి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కూడార్రై ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా గోదా రంగనాథుల ఉత్సవమూర్తుల ఎదురుగా 108 గిన్నెలలో పాయసాన్ని ఆరగింపు నివేదన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


చిన్నబజారులోని ఆలయంలో స్వామివారికి ప్రసాదాల నివేదన

కర్రసాము క్రీడాకారుడికి సత్కారం


భాగ్యచంద్రను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన జాతీయస్థాయి కర్రసాము క్రీడాకారుడు పిట్టా భాగ్యచంద్ర యాదవ్‌ను జాతీయస్థాయి బీజీ సంక్షేమ సంఘ నాయకులు సత్కరించారు. విజయవాడలో జరిగిన ఆ సంఘ జాతీయ కార్యవర్గ సమావేశంలో పలు జాతీయ, అంతర్జాతీయస్థాయి కర్రసాము (సిలంబం)పోటీల్లో పతకాల పంట పండించిన భాగ్యచంద్రను ఘనంగా సత్కరించి అభినందించారు. బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.వెంగలరావు, మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ, వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ

శ్రీకాకుళం అర్బన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. దీంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీంతో స్థానిక కాంప్లెక్స్ ఆవరణ, ప్రధాన రోడ్డుపై ఆర్టీసీ అధికారులు, సిబ్బంది బుధవారం ట్రాఫిక్‌ను నియంత్రించారు. శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు కె.మాధవ్, కె.ఎస్.ఆర్. శర్మలు మాట్లాడుతూ.. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో కాంప్లెక్స్ ముందు ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయి బస్సులు బయటకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. దీంతో ప్రైవేటు వాహనాలు, ఆటోలు కాంప్లెక్స్ ముందు ప్రధాన రోడ్డుపై నిలుపుదల చేయకుండా పరిరక్షణ కమిటీగా ఏర్పడి ఇన్, ఔట్ గేట్ల వద్ద ట్రాఫిక్‌ను నియంత్రణ చేస్తున్నామన్నారు.


కాంప్లెక్స్ ముందు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న అధికారులు

1120 మందికి 'జగనన్న తోడు'

శ్రీకాకుళం రూరల్: జగనన్నతోడు ఆరో విడతలో మండల పరిధిలోని 1120 మంది లబ్ధిదారులకు మేలు జరిగింది. వీరి బ్యాంకు ఖాతాల్లోకి 1,77,055 రూపాయలను బుధవారం జమ చేశారు. లబ్ధిదారులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అంబటి నిర్మలాశ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఎంపీడీవో రఘు, ఏఎంసీ ఛైర్మన్ మూకళ్ల తాతబాబు, ఏపీఎం సుజాత పాల్గొన్నారు.